మిసిమి

A Telugu Fortnightly సంపుటి 1 సంచిక 2



10-3-1990

మిసిమి

MISIMI

(A Telugu Fortnightly)

సంచిక 2 | 10-3-1990 | సంపుటి 1

విషయసూచిక

1. ఈ దేశం బాగుపడాలంటే

— ఎం.వి. రామమూర్తి

2. సుభాస్ చంద్రబోస్ గెలిస్తే దేశం ఏమయ్యేది?

— డా. ఎన్. ఇన్నయ్య

ఒక రూపాయి

ఈ దేశం బాగుపడాలంటే

— ఎం.వి. రామమూర్తి.

ఈదేశం బాగుపడాలంటే చేపట్టవల సిన ప్రప్రథమ చర్యలు ఏవి? ప్రజలకు శీల సంపద ఏర్పడాలని నీతి శాస్త్రజ్ఞులు సూచిస్తారు. అందరికీ తిండీ, గుడ్డా లాంటి ప్రాథమిక అవసరాలు తీర్చాలని ఆర్థికతపై నొక్కిపెట్టేవారు వాదిస్తారు. అసలు ప్రజలు పనిచేసే పద్ధతిని అలవర్చు కోవాలని పెట్టుబడిదారులు పట్టుపడ్తారు. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలు తమదిగా చేసుకోవాలని హేతువాదులు ప్రకటిస్తారు. దేవుని ఉనికిని అంగీకరించరాదని నాస్తి కులు చెప్తారు. దేశ సంపదను జాతీయం చేయాలని కమ్యూనిష్టులు ఎలుగెత్తి చాట్తారు. సమానావకాశాలుకల సమాజస్థా పనకు లక్ష్యంగా స్వీకరించాలని సోషలి స్టులు ప్రచారం చేస్తారు. సైన్సు, సాంకేతిక విధానం వీటిని ప్రజా జీవితంలో ముఖ్యంగా ఫ్యాక్టరీలలో ప్రవేశించాలని శాస్త్రజ్ఞులు సలహాచెప్తారు. కులంపోతే గాని దేశం బాగుపడదని కులనిర్మూలన సంఘంవారు ఘోషిస్తారు. సర్వ మత సమానత్వభావన వ్యాప్తి చెందాలని కొందరు మతస్తులు ప్రజలకు నచ్చజెప్పా లని చూస్తారు. రాజ్యానికి మతానికి సంబంధం ఉండరాదని సెక్యులరిస్టులు గట్టిగా నొక్కివక్కాణిస్తున్నారు. ఇలా పలువురు పలు అభిప్రాయాలను వెలిబు చ్చుతున్నారు. దేశాన్ని బాగుచేద్దామనే సదుద్దేశం కల వ్యక్తి గందరగోళంలో పడి పోతున్నాడు.

నిజానికి అనేక పనులు చేస్తేగాని దేశం బాగుపడదు. అయితే అన్నింటిని ఒక్కసా రిగా చేయలేము. ముందు వెనుకలుగా వాటిని చేయాల్సి ఉంటుంది. అయితే వేటిని ముమ్మందుగా చేయాలనేది ప్రధా నాంశం.

1. ప్రాథమిక అవసరాలు: ప్రజలందరికి ఆహారం, వస్త్రం, విద్య, వైద్యం, ఇల్లు లాంటివి ప్రాథమిక అవసరాలుగా పరిగ ణింప బడుతున్నాయి. ఈనాటి గణాంక లెక్కల ప్రకారం 40 శాతం ప్రజలు బీదరికపు రేఖకు దిగువన ఉన్నారు. తగి నంత తిండి, దుస్తులు, ఆశ్రయం లేకుండా ఉన్నారు. ప్రజలందరికీ వివక్షలే కుండా అవి అందేలా ప్రణాళికలు వేసుకో వాలి. వీటి తయారీ, పంపిణీ ప్రప్రథమ కర్తవ్యంగా రాజ్యం ఎంచుకోవాలి. అయితే ప్రజలను ఊరక కూర్చోపెట్టి వీటిని అందించాలని భావం కాదు. ప్రతి ఒక్కరు శ్రమ చేయటానికి అంగీకరిస్తే వాటిని వారికి అందించాలని ఆ భావం యొక్క తాత్పర్యం. ఈ అవసరాలను తీర్చే క్రమంలో తతిమ్మా పరిశ్రమలు, వనరులు పెరుగుతాయి.

2. పని పద్ధతి: ఈనాడు ప్రభుత్వోద్యోగు లలో, కార్మికులలో పనియెడల కొంతగా వైముఖ్య భావన పెరుగుతున్నది. పనిలో అలసత్వం వృద్ధి అవుతున్నది. పని చేసినా పట్టుదలగా, నాది అనే భావనతో చేయడం లేదు. యజమానుల వైఖరివల్ల కార్మికులలో ఇలాంటి పద్ధతి ఉదయించి ఉండవచ్చును. కాని దేశం మొత్తంమీద యజమానులందరూ అలా ప్రవర్తిస్తున్నా రని చెప్పలేము. అధిక సంఖ్యాకులు అలా చేస్తున్నారు. ఇక ప్రభుత్వోద్యోగులలో పని యెడల నిర్లక్ష్య భావం మెండుగా ఉంది. ఇది శోచనీయం.

పని పద్ధతిలో నీతిని ప్రవేశపెట్టటం (WORK ETHIC) అవసరం. లేకపోతే దేశ సంపద పెరుగదు. దేశ సంపద పెరగకపోతే ప్రజలకు పంపిణీ చెయ్యటా నికి ఏమీ మిగలదు.

3. ప్రజాప్రతినిధులు: ఈనాడు అన్నింటి కన్నా తేలికగా చేపట్టున్న పని రాజకీయ వ్యావృత్తి. ఒక పదవిని ఆశించేవారు దీనికి నేను తగుదునా అని ఆలోచించటం లేదు. ఎవరో 'నీవు తగవు' అన్నారు కనుక నేను పోటీచేస్తాను అని మనస్తత్వం ప్రబలింది. ప్రతి వృత్తికి లేక ప్రతిపనికి అర్హత లేదన్నట్లు కన్పిస్తున్నది. ఏ వృత్తి లోనూ ప్రవేశం లేనివారు దీంట్లోకి వస్తున్నారు. అధికార పదవుల కోసం ఆరాటం ఎక్కువయింది. ఆ పదవి వచ్చిన తరువాతగాని పెద్దగా ఏమీ చేయలేక పోతున్నామనే స్పృహ కలుగదు. అప్పటికి అది అలవాటు అవుతుంది. శ్లేష్మంలోపడ్డ ఈగలాగా గిలగిల తన్నుకుంటూ అలాగే ఉంటారు.

తోటివారు తనని గుర్తించాలని ప్రతి వ్యక్తి ఆశిస్తాడు. అది సహజం. అయితే ఈయీవ ఇతరులకు నష్టం జరుగని పద్ధతిలో ప్రబలితే ప్రమాదం లేదు. నగరంలో అందరి కార్లకన్నా పొడుగాటి కారు, అన్ని భవనాలకన్నా ఎత్తయిన భవనం ఇలాంటిని సంపాదించి పేరు పొందేవాళ్ళు ఉంటారు. పేరుకోసం ప్రజల రాజకీయ జీవితంతో చెర్లాట లాడటం క్షంతవ్యం కాదు. గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో ఓటర్ల సంఘాలు, ప్రజా సంఘాలు బలపడితే అవి ఇలాంటి రాజకీయ జీవులను అదుపులో పెట్టగలవు. ఎన్నికలలోని అభ్యర్థులను రాజకీయ పార్టీలు నిర్ణయించినంత కాలం ఈ కొరగాని రాజకీయవాదుల సంఖ్య తగ్గదు. అయితే ఓటర్ల సంఘాలు కొంత వరకు అలాంటి వారికి అంకుశంలా పని చేయ గలవు. మొత్తంమీద రాజకీయాలను క్షాళణం చేయవలసిన అగత్యం విషయంలో అందరూ అంగీకరిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నంత కాలం ఈ ప్రజా ప్రతినిధుల సమస్య ప్రజలను చికాకు పరుస్తూనే ఉంటుంది.

4. శాసనాల అమలు: ఈనాడు శాసనాల జాబితాలో మంచి శాసనాలు కూడా ఉన్నాయి. అయితే వాటిని అమలుపరచటం లేదు. సదుద్దేశ్యం ఉన్నంత మాత్రాన చాలదు. ఆ ఆశయాలను క్రియారూపంలో పెట్టాలి. అప్పుడే అవి సార్థకమవుతాయి. మంచి జరుగుతుంది. ఒక చిన్న ఉదాహరణ: ప్రభుత్వ ఆస్పత్రులలో రోగికి ఇవ్వ నిర్ణయించిన ఆహారం, పాలు వగైరా వారికి ఇస్తే మందు లేకుండానే సగం రోగం నయమవుతుంది. గ్రామాలలో పాఠశాలలో అందరు ఉపాధ్యాయులు పాఠశాలకువచ్చి తమ విధులను నిర్వర్తిస్తే పిల్లలకు విద్యాబుద్ధులు వస్తాయి.

5. ప్రభుత్వ యంత్రాంగంలో జాప్యం: ప్రభుత్వం పనిచేసే తీరును గమనించిన వారికి దుఃఖమూ వస్తుంది. నవ్వూ వస్తుంది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీతో ప్రారంభం అవుతుంది. అయితే ప్రాజెక్టుల పనితీరు హాస్యాస్పదం. బడ్జెటు ప్యాసయిన మూడు నెలలకుగాని అంటే జూన్ నెలాఖరుకుగాని చేయవలసిన పనుల విషయం అంతుపట్టించుకోరు. సెప్టెంబరు ప్రాంతంలో ప్రాజెక్టుకు ఆమోదముద్ర వస్తుంది. వచ్చే సంవత్సరం జనవరి చివరలోనే లేక ఫిబ్రవరి మధ్యలోనే ఆర్థికపరమైన ఆమోదం వస్తుంది. అంటే తీరా పనిచేయటానికి ఒకటున్నర నెల లేక రెండు నెలల వ్యవధి ఉంటుంది. సంవత్సరంలో జరుగవలసిన పనిని అంత హడావుడిగా చేయిస్తే జరిగే ఫలితాలు ఇలా ఉంటాయి. (1) పని సమర్థవంతంగా జరుగదు. (2) పనిలో మోసం ఉంటుంది. కొద్దిగా పనిచేసి మొత్తం పనిచేసినట్లు రిపోర్టు యివ్వడం

జరుగుతుంది. (3) మోసాన్ని కనిపెట్ట డానికి కూడా వీలుఉండదు. ఉదాహర ణకు కాలువలో సగం పూడిక తీస్తారు. మొత్తానికి కొలతలిస్తారు. ఇంతలో కాలువ లోకి నీళ్ళు వస్తాయి. మరోకరు తనిఖీ చేయడానికి అవకాశం లేదు. ఈ పద్ధతి మారితేనే ప్రణాళికలు విజయవంతం అవు తాయి.

న్యాయ వ్యవస్థ: ఈనాడు ప్రజోద్యమాల బలం తగ్గింది. రాజకీయ పార్టీలపై ప్రజ లకు నమ్మకం పోతున్నది. కాకపోతే అవస రమైన చెడుగా (Necessary Evil) వాటిని ప్రజలు పరిగణిస్తున్నారు. ప్రజా సంఘాలు చాలచోట్ల లేవు. ఉన్నచోట్ల బలహీనంగా ఉన్నాయి. ప్రజలు తమ వ్యవహారాల్లో తాము పాల్గొనటం లేదు. ప్రాయోపవేశం ద్వారా పనిసాధించే మహా త్ముని కోసమో లేక హింస, దౌర్జన్యాల దళసభ్యుల కోసమో ప్రజలు ఎదురు చూడడం అలవాటుయింది. ఈ రెండు పద్ధతులు నచ్చనివారు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. న్యాయస్థానాలలో జరిగే జాప్యం సర్వజన విదితం. ఒక వ్యాజ్యం పరిష్కారం కావటానికి ఏండ్లు పడుతున్నది. న్యాయాధిపతులందరూ సమర్థులని చెప్పలేని స్థితి సంభవించింది. సమర్థులైన న్యాయాధిపతులను అధిక సంఖ్యలో ప్రభుత్వం నియమించి న్యాయ స్థానాల పేరుప్రతిష్టలను కాపాడటం అవశ్యం జరుగవలసిన పని.

పైన సూచింపబడిన పనులు విప్లవా త్మకం అసలేకాదు. సంస్కరణ అంత కన్నా కాదు. కాగా ఉన్న వ్యవస్థను ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరిచే పద్ధతి మాత్రమే. ఈ సూచనలను అమలుపరచ టానికి క్రొత్తగా శాసనాలు చేయనక్కర లేదు. ఇతోధికంగా అధికారాలను ప్రభు త్వాలు ఆశించనక్కరలేదు. కావలసింది ఒక్కటే చిత్తశుద్ధితో కూడిన రాజకీయ సంకల్పం.

సుభాస్ చంద్రబోస్ గెలిస్తే దేశం ఏమయ్యేది?

(గత సంచిక తరువాయి)

— డా. ఎన్. ఇన్నయ్య

బరులో బోసు రహస్యంగా వుండటం పైనా ''దేశ ద్రోహచర్యల'' పైనా బ్రిటిష్ పత్రికలు, ఇండియాలో పత్రికలు ప్రకటించాయి. నవంబరు 10న ఆలిండియా రేడియో కూడా బోసు బెర్లిన్‌లో వున్నాడని ప్రసారం చేసింది.

1941 ఏప్రిల్ నుండి జర్మన్ విదేశాంగ మంత్రి బోసును చూడడానికి నిరాకరించాడు. కాని తనపై వచ్చిన ప్రచారం దృష్ట్యా, తాను విదేశాంగ మంత్రిని చూచి తీరాలని బోసు పట్టు పట్టాడు. 1941 నవంబరు 29న రిబ్బన్‌ట్రూప్ దర్శనమిచ్చాడు. తనను దేశద్రోహిగా ఇండియాలో ప్రసారం చేస్తున్న దృష్ట్యా సమాధానం యివ్వవలసిన సమయం వచ్చిందని బోసు చెప్పాడు.

ఇండియా పట్ల హిట్లర్ ధోరణి ఏమిటో స్పష్టం కావాలని బోసు మరోసారి విదేశాంగమంత్రిని అడిగాడు. వీటికి రిబ్బన్‌ట్రూఫ్ సూటిగా సమాధానం యివ్వక, ప్రస్తుతం హిట్లర్‌తో సమావేశం ఏర్పరిస్తే అనవసర ప్రసారం జరుగుతుందన్నారు. బ్రిటన్‌పై సైనిక విజయం సమకూరితేనే ఇండియాకు విముక్తి కలగవచ్చునన్నాడు. అయితే రెప్లర్ ఒక సూచన చేస్తూ జర్మనీలో బోసు వున్నట్లు ప్రకటించి, హిట్లర్‌తో సమావేశం ఏర్పరిస్తేనే మంచిదన్నాడు. బోసు గనుక ప్రసారాలు చేయకపోతే ఇండియా కేంద్రం కొనసాగించడం అవసరమని రిబెన్‌ట్రూప్ భావించారు.

ఏమైనా బోసు విదేశాంగ మంత్రిని కలసినందు వలన జర్మనీ ధోరణిలో కించిత్తు మార్పురాలేదు. బోసు అధ్వర్యాన భారత కమిటీని ఏర్పరచవచ్చుగాని, కేవలం ప్రసారం వల్ల ఇండియాకు విమోచన రాదని హిట్లర్ తన భావాలను జెరూసలెం నుండి వచ్చిన గ్రాండ్ ముఫ్తీతో అన్నాడు.

1941 డిసెంబరు 17న బెర్లిన్‌లో జర్మనీ రాయబారిని కలిసి తనను దక్షిణాసియాకు తరలించమని టోకియో కోరాలని, వారి రక్షణ క్రింద భారత స్వాతంత్ర్యోద్యమాన్ని నడుపుతాననీ సూచించారు. వోర్‌మన్‌ను కూడ కలిశాడు. కాని పనేమి జరుగలేదు. టోకియోలో భారత విమోచన ప్రకటన విడుదల అయినట్లు, బోసు వీరితో చర్చలు జరుపుతున్నట్లు వదంతులు వ్యాపించటం పట్ల బెర్లిన్ కలవర పడింది.

బోసును జపాన్‌కు (దూర ప్రాచ్యానికి) తరలించే విషయం జర్మన్ విదేశాంగ మంత్రి రిబెన్‌ట్రూప్ ప్రస్తావించాడు. జపాన్ పక్షాన వోహిమా ఇందుకు సుముఖత చూపాడు.

బోసును ఆసియాకు

బ్యాంకాక్‌లో భారత జాతీయ సమితి ఒకటి ఏర్పడి సుభాష్ చంద్రబోసును తీసుకరమ్మని ఒత్తిడి చేశారు. బోసు పంపించిన తరువాత టోకియో ఉత్తరువును కాదని, బెర్లిన్ ఉత్తరువులను ఎలా ఖాతరు చేస్తారనే సమస్య వచ్చింది.

1942 జనవరి 18న జర్మనీ విదేశాంగ మంత్రి బోసును దూర ప్రాచ్యానికి (బ్యాంకాక్) పంపటానికి నిరాకరించాడు.

ఇండియాలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్రోహ చర్యల విషయమై 1942 జనవరి 27నసమావేశానికి బోసును ఆహ్వానించారు. ఇండియాలో తిరుగుబాటుకు సర్వసన్నద్ధంగా ప్రజలు ఉంటారని బోసు పునరుద్ఘాటించారు. ఒకవేళ జపాన్ గనుక ఇండియాపై బాంబులు వేస్తే బ్రిటిష్‌వారు దుష్ప్రచారం చేయకముందే ఇండియాకు స్వాతంత్ర్యం యిస్తామనే ప్రకటన చేయాలన్నాడు. బర్మాను

ఆక్రమించటం, ఇండియా తీరాలలో జపాన్ ప్రవేశించడంతో బ్రిటిష్ వారికి నవనాడులూ కదలి పోతున్నాయి. ఇండియా విమోచనకు జపాన్ వ్యతిరేకం. ఆ సమావేశంలో పాల్గొన్న జపాన్ ప్రతి నిధి కల్నల్ యమామాటోకు ఆ సంగతి తెలుసు. అయితే బోసు సూచించినట్లు బర్మా ఆక్రమణ పూర్తికాగానే ఇండియాపై దాడిచేయమనే విషయం టోకియోకు తెలియ పరుస్తానన్నాడు. తిరిగి 1942 ఫిబ్రవరి 6న సమావేశం జరిగినా బోసుకు వారెవరూ జపాన్ ఇండియాపై దాడి చేయనున్నదో చెప్పలేదు. సరిగదా ఇండియా విమోచన విషయ, తేల్చలేదు-కాని జపాన్ దాడి జరిగేలోగా బోసు అనుచరులతో ఇండియాలో విద్రోహచ ర్యలు కొనసాగించాలని మాత్రం తీర్మానిం చారు.

సింగపూర్ జపాన్‌కు లొంగి పోగానే బెర్లిన్‌లో బోసు విజృంభించాడు. 1942 ఫిబ్రవరి 27న మొట్టమొదటి సారిగా ఆజాద్ హింద్ రేడియోలో ప్రసారం చేయటానికి అనుమతి యిచ్చారు. అప్ప టికి బోసు రహస్యంగానే వుంటూ సినార్ మజహె పేరుతో చలామణి అవుతున్నారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరిస్తూ సింగపూర్ వారి చేతుల్లో నుండి పోవడ మంటే బ్రిటిష్ సామ్రాజ్యం పతనమైనట్లే నన్నాడు. ఇండియా విమోచన విషయమై బోసు తన పట్టును వదులుకొనక తప్ప లేదు. బోసు ప్రథమ రేడియో ప్రసంగం ఉద్వేగ ధోరణిలో వుంది. దీనిని ప్రపంచ వ్యాప్తంగా నాజీ, ఫాసిస్టు రేడియోలు అనేక పర్యాయాలు అనేక భాషలలో ప్రసారం చేశాయి. బోసు ప్రకటన అనంతరం గోబెల్స్ మాట్లాడుతూ, బోసు ప్రసారం వలన ప్రపంచంలో ప్రగాఢమైన అభి ప్రాయం కలిగిందన్నారు. బోసు ఎక్కడ వున్నదీ లండన్‌కు తెలియదనీ, హిట్ల ర్‌తో సమావేశానంతరమే బయట పెడ తామనీ గోబెల్స్ అన్నారు.

1942 మార్చిలో బోసు మొత్తం 5 ప్రసంగాలు చేశారు. అవన్నీ ప్రసారమ య్యాయి.

1942 ఏప్రిల్‌లో కూడా మరో 5 రేడియో ప్రసంగాలను బోసు ప్రసారం చేశాడు. బోసు మాటల్ని వ్యతిరేకులు, అనుకూలురు కూడా ఆసక్తితో విన్నారు.

అంతవరకూ బోసును వ్యతిరేకిస్తూ దాడి చేసిన మహమ్మద్ షెదాయ్ అప్పటి నుండీ బోసుపై ప్రచారం మానివేశారు. బెర్లిన్, రోంలు కలిసికట్టుగా ఇండియా ప్రచారం చేశాయి.

బోసు ఆత్రుత

1942 ఫిబ్రవరి 26న జరిగిన సమావే శంలో తనను రంగూన్ వెళ్లనివ్వమని బోసు బ్రతిమాలాడు. జపాన్ సైనిక ప్రతి నిధి కూడా ఆ సమావేశంలో పాల్గొ న్నారు. బర్మాలో ఇండియా ప్రచార కేంద్రం స్థాపించాలనీ, బర్మాను స్వేచ్ఛా స్వాతంత్ర్య దేశంగా బ్రిటిష్ వారు పోగానే ప్రకటించాలనీ, దీని వలన ఇండియాలో జపాన్ పట్ల సద్భావం కలుగుతుందనీ బోసు సూచించాడు.

బ్రిటిష్ ప్రభుత్వమూ, నెహ్రూ రాజీప డక ముందే జపాన్‌వారు ఇండియా సైకి రావాలని బోసు అభిప్రాయ పడ్డారు. జపాన్ సైన్యంతోబాటు భారత జాతీయ వాదాలు కూడా వుండాలి. పశ్చిమ ఉత్త రాన జర్మనీవారు, తూర్పున జపాన్ సైన్యాలు ఇండియాలో ప్రవేశిస్తే, బ్రిటిష్ వారు దిగ్బంధనమవుతారన్నాడు. బోసు సూచనన్ని ఫీల్డ్ మార్షల్ కైటర్‌కు పంపి స్తానని లాహోసెన్ చెప్పాడు.

1942 మార్చి 11న బ్యాంకాక్‌లోని జర్మన్ లెగేషన్ ఒక తంతి పంపిస్తూ 250 మంది భారతీయాధికారులకు లెఫ్టినెంట్ కల్నల్ ఎన్.ఎస్. జిల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని, సింగపూర్‌లో 3300మంది భారతీయ సైనికులు, ఇండియన్ నేషనల్ కౌన్సిల్‌లోని 6వేల మంది కూడా బోసును వచ్చి నాయకత్వం స్వీకరించమంటున్నారని తెలియ పరిచారు. బోసు అవినీతిపరుడు కాదనీ, ఆయన సుప్రీం కమాండరుగా బాధ్యతలు స్వీకరిస్తే జపాన్ వారికి తాము సేవలు చేస్తున్నామనే భావన భారత సైన్యానికి ఉండదనీ తంతిలో పేర్కొన్నారు.

సింగపూర్ పతనంతో రాజీపడే నెహ్రూకు బోసు గ్రహణం పట్టించాడని హిట్లర్ వ్యక్త పరిచారు. కాని జపాన్ ఆధిపత్యం క్రింద ఇండియా పోవటం కన్నా బ్రిటిష్ వారి పెత్తనం క్రిందవుంటే బాగుంటుందని హిట్లర్ ఉద్దేశ్యం. హిట్లర్ ఏమి చెప్పినా బోసును ఆసియాకు పోనివ్వలేదు. జపాన్‌వారు నిరాకరించినందున పోవటానికి వీలు లేదని రిబెన్‌ట్రూప్ చెప్పారు. బెర్లిన్‌లో వుండలేక తన అతిథి గృహంలో బోసు నివసించాడు. జర్మనీ పట్ల బోసుకు అసంతృప్తిగా వున్నది.

1942 మార్చి 28న టోకియోలో భారతీయ నాయకుల సమావేశానికి వెడుతున్న విమాన ప్రమాదంలో స్వామి సత్యానంద పూరి, ప్రీతంసింగ్, కె.ఏ.ఎన్. అయ్యర్, యం. అక్రమ్‌ఖాన్ చనిపోయారు. జపాన్‌వారు తమకు అనుకూలుడైన రాష్ .బిహారీ బోస్‌ను ఇండియా స్వాతంత్ర్య లీగ్‌కు అధిపతిగా చేశారు. మలయా ప్రతినిధులు ఇందుకు నిరసన తెలిపారు. ఈ సమావేశం తీర్మానిస్తూ, ఆజాద్ హింద్ ఫౌజు అధ్వర్యాన భారతదేశంపై దాడి జరగాలన్నారు. జపాన్ అన్ని విధాలా సహాయ పడుతుందని ప్రధాని టోజో హామీ ఇచ్చారు.

1942 మే 4న సుభాష్ చంద్రబోస్ రోమ్‌లో ముస్సోలిని, సియానోలను కలసి భారత స్వాతంత్ర్య ప్రకటనను నిరవధికంగా వాయిదా వేయడం పట్ల తన నిస్పృహ వెల్లడించాడు. క్రిప్స్ రాయభారం విఫలమైన దృష్ట్యా, ఇది అవకాశంగా తీసుకొని ఇండియా విమోచనకై జర్మనీ, జపాన్‌లు ప్రకటన చేయాలన్నారు. బోసు మాటలకు తృప్తి పడి రెండు రోజుల అనంతరం బెర్లిన్ తన నిర్ణయాలను పునరాలోచించాలని, ముస్సోలినీ కోరాడు.

బోసు తన రేడియో ప్రసంగాలలో ఇండియాలో తనకు పంచమాంగదళం అనంతంగా వున్నదని, అధికారులలోనే 50 వేల వరకు తన వారున్నారనీ, దేశ వ్యాప్తంగా తన రహస్య గూఢాచారులు కోడ్ నివేదికలు అందుకుంటున్నారని జపాన్ సహాయంతో దక్షిణాసియాలోని భారతీయులతో ఇండియాపై దండెత్తుతానని ప్రకటించారు.

జపాన్ సైన్యం ఇండియాకు వచ్చినప్పుడు వీరికి తోడ్పడాలని, ఫ్యాక్టరీలో 'గోస్లో' పద్ధతి అనుసరించాలనీ, జర్మనీలో శిక్షణ పొందిన భారతీయ దళం సమయానుకూలంగా విమానాల్లో వస్తుందనీ రేడియో ప్రసంగాలలో 1942 ఏప్రిల్ మేలో బోసు చెప్పాడు.

1942 మే 9న రోమ్‌నుండి తిరిగి వచ్చిన బోసు విదేశాంగ మంత్రి రిబెన్‌ట్రూప్‌కు వ్రాశాడు. కాని హిట్లర్ మాత్రం ఇండియా స్వాతంత్ర్య ప్రకటనకు అంగీకరించ లేదు. జపాన్ తనను ఆహ్వానించినట్లు హోర్‌మన్‌తో బోసు చెప్పినప్పుడు ఆధారలేమిటంటే, రాయబారి దోహి

మాతో జరిపిన సంభాషణ లేనన్నారు. ఆసియాకు వెళ్ళటానికి విమానం యిస్తా నని ముస్సోలినీ చెప్పినట్లు బోసు పేర్కొన్నాడు. కె. ఆస్మన్ అనే అధికారి బోసును జర్మనీ సమర్థించాలన్నాడు. బోసు త్వరలో ఇండియాలో అధికారం చేజిక్కించుకోవచ్చునని కూడా ఆ అధికారి అభిప్రాయం. హార్మన్ కూడా చివరకు బోసును సమర్థించాడు. వైజుసాకర్ అనే అధికారి మాత్రం బోస్‌ను సమర్థించే సమయం రాలేదన్నారు.

1942 మే 27న హిట్లర్ ఉండేచోటకు బోసును విమానంలో తీసుకువెళ్ళారు. అక్కడ విదేశాంగ మంత్రి రిబెన్ ట్రూప్ కలసి బోసు ఉత్తరాలకు సమాధానం యివ్వలేనందుకు క్షమాపణ కోరి, త్వరలో బోసును ఆసియాకు పంపిస్తానన్నాడు. అయితే యిటలీ వారి విమానంలో ప్రయాణం చేస్తే ప్రమాదం వున్నది గనుక జలాంతర్గామిలో (సబ్‌మెరిన్) ఏర్పాటు చేయవచ్చునన్నారు. బోసు అడిగిన భారత స్వాతంత్ర్య ప్రకటనపై మాత్రం అంటీ అంటనట్లే సమాధానం యిచ్చి వూరుకున్నారు.

బోసుకు హిట్లర్ దర్శనం

1942 మే 27 సాయంత్రం హిట్లర్ ఎట్టకేలకు బోసుకు దర్శనమిచ్చాడు. అప్పుడు రిబన్ ట్రూప్, కెప్లర్, హెవెల్ కూడా వున్నారు. హిట్లర్‌ను వృద్ధ విప్లవకారుడుగా పేర్కొని బోసు అభివాదం చేశాడు. జపాన్ చేతుల్లోకి ఇండియాకు సంబంధించిన ప్రచారం పూర్తిగా పోకుండా చూడమని, తరువాత తన పథకాన్ని బోసు చెప్పాడు.

హిట్లర్ ఏక పాత్రాభినయంలో ప్రసంగం వలె భవిష్యత్తులో ప్రపంచాన్ని గురించి తన భావాలేమిటో ఏకరువు పెట్టాడు. శత్రువును పూర్తిగా వోడించకుండా ఇండియా స్వాతంత్ర్య ప్రకటన చేసినందువలన ప్రయోజనం లేదన్నాడు. తానొక సైనికుడుగా రాజకీయాధికారంతో పోరాడుతున్నందున తప్పుడు అంచనాలు వేయనన్నాడు. ప్రకటన చేయాలంటే తనకు యింకా అనేక డివిజన్ల సైన్యం అవసరమన్నాడు. అయితే మూడు మాసాలలోగాని, ఒకటి రెండు సంవత్సరాలలో గాని అలాంటి అవకాశం లభించగలదన్నారు. ఇండియా చాలా దూరాన వున్నందున విమానాల్లో చేరగలమని లేదా పర్షియన్ అఖాతం, ఆఫ్ఘనిస్తాన్ మీదుగా కాల్బలంతో వెళ్ళవలసి వుంటుందని అన్నాడు. హిట్లర్ అలా మాట్లాడుతూ ఇండియాకు సరైన దారి రష్యా మీదుగా వుందన్నాడు. జపాన్ వారు తరువాత ఏం **చేయనున్నారో** తెలియదనీ, చాంగ్‌కై షేక్‌పై దాడి చేస్తారో, ఆస్ట్రేలియా పైకి పోతారో, ఇండియా పైకి వస్తారో చూడవలసి వున్నదని అన్నాడు. ఇండియాకు ప్రత్యక్ష సహాయంతో జర్మనీ పాత్ర తక్కువే అయినా, ఉత్తర ఆఫ్రికాలో సైన్యాల వోటమి వలన ఇండియాలో జాతీయ పోరాటానికి తోడ్పడినట్లనని హిట్లర్ చెప్పాడు. బ్రిటిష్ వారిని వోడించాలంటే ఇండియాలో అంతర్గత పోరాటం, బయట జర్మనీ, ఇటలీ, జపాన్‌లు దాడి చేస్తేనే సాధ్యమన్నాడు. జర్మనీ ప్రభావం మాత్రం కొన్ని మాసాలలోనే వుండొచ్చునని అన్నాడు. కనుక జపాన్ వెళ్ళ వలసిందిగా బోసుకు సలహా యిస్తూ జపాన్ వారివ్యక పోతే, తానే ఒక సబ్‌మెరిన్ యిస్తానని హిట్లర్ తన సదీర్ఘ ప్రసంగాన్ని ముగించాడు.

తనను స్కూలు **పిల్లాడివలె** హిట్లర్ పరిగణించడం బోసుకు నచ్చలేదు. అయినా మైన్ కాంపులో ఇండియన్ల గురిం

చిన వ్రాతలపై వివరణ అడుగుతూ, శత్రు వులు వీటి ఆధారంగా తనకు అనుకూల ప్రచారం చేసుకున్నారని బోసు చెప్పాడు.

తన భావాలలో తప్పేమీ హిట్లర్‌కు అగుపించలేదు. ఇండియాను చూచిన తరువాత అహింసాయుత పోరాటాన్ని జర్మనీలో నిరుత్సాహ పరచి ప్రపంప వ్యాప్తంగా అణచివేతకు గురైన వారి ఐక్య సంఘటన ఏర్పరచాలన్నదే తన ధ్యేయ మని హిట్లర్ అన్నాడు.

ఇది జరిగిన తరువాత, హిట్లర్ తలబి రుసుగా స్వేచ్ఛా భారతదేశం ఎలా యుండాలో చెప్పాడు. బ్రిటిష్ ప్రభా వాన్ని తటస్థం చేయడం, రష్యా ఒత్తిడికి అడ్డుగా నిలవడం తూర్పు సరిహద్దు గురించి ఒకటి రెండు వందల ఏళ్ళు పట్టొచ్చని హిట్లర్ అభిప్రాయపడ్డాడు!

హిట్లర్‌పై బోసు పెట్టుకున్న ఆశ లన్నీ ఆ విధంగా ఏకైక సమావేశంలో పటాపంచలయ్యాయి. కనీసం కొద్ది నిమి షాలైనా ఏ ఒక్క విషయాన్ని గురించి కూడా హిట్లర్‌తో చర్చించడం సాధ్యం కాదని బోసు చెప్పాడు. జర్మనీలో 14 మాసాలు పడిగాపులు కాచిన బోసు శ్రమ అంతా వృధా అయింది.

బోసు, హిట్లర్ సమావేశం ఎక్కడ జరిగిందనే విషయమై వివాదం వున్నది. చాన్సలరీలో జరిగిందని హిట్లర్ కేంద్ర కార్యాలయంలో కాదని డోమరస్, హిల్ గ్రూబర్‌లు వ్రాశారు. అధికార జర్మన్ ప్రెస్ ఏజన్సీ ప్రకారం హిట్లర్ కేంద్ర కార్యాలయంలో 1942 మే 29న సమా వేశం జరిగింది. భోసు ముస్సోలినీ సమా వేశంతోబాటు యీ సమాచారాన్ని విడు దల చేయమని రిబన్‌ట్రూప్ చెప్పాడుట జపాన్‌ను తృప్తిపరచడానికి యిలా చేశా డంటారు.

1942 జూన్ 12న బెర్లిన్‌లో పత్రికా విలేఖరుల సమావేశంలో బోసు పాల్గొ న్నాడు. ఫాసిస్టు రాజ్యాలు బ్రిటిష్ వారిని ఇండియా నుండి పారద్రోలే నిమిత్తం చేసిన ఆర్థిక సహాయాన్ని ఆయన గుర్తించి, కృతజ్ఞత తెలిపారు. క్రిప్స్ రాయబార వైఫల్యానంతరం, ఇండియాలో అశాంతి ప్రబలి, బ్రద్దలయ్యే దశకు వచ్చిం దని బోసు చెప్పారు. ఇండియాకు స్వేచ్ఛ అంటే ఆసియా నుండి అమెరికా-బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి స్వస్తి పలకడమేననీ, ఇందువలన ప్రపంచంలో స్వాతంత్ర్యోద్య మాలకు ప్రోత్సాహం లభిస్తుందనీ అన్నారు. కొన్ని వారాలపాటు పత్రికా విలేఖరుల సమావేశాలు బోసుకు చాలా ప్రచారాన్ని తెచ్చి పెట్టాయి.

1942 జూన్‌లో బ్యాంకాక్‌లో జరిగిన భారతీయుల సమావేశం రాష్‌బిహారీ బోస్‌ను తమపై జపాన్ బలవంతంగా రుద్దడాన్ని నిరసిస్తూ తీర్మానించారు. థాయ్‌లాండ్ లెగేషన్ ఏప్రిల్, మే మాసా లలో పంపిన సమాచారాన్నిబట్టి అక్కడి భారతీయులు సుభాష్ చంద్రబోసును కోరుకున్నారు. ఇండియా వ్యవహారాల్లో జపాన్‌ను యిబ్బందిపెట్టి పనేదీ చేయవ ద్దని రిబన్‌ట్రూప్ సలహా యిచ్చాడు. ఆసియాకు బోసు సురక్షితంగా చేరేట్లు చూడవలసిందిగా బ్యాంకాక్ సమావేశం జపాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

బోసును స్వీకరించడానికి జపాన్ ఒక పట్టాన అనుమతించలేదు. అతడు వస్తే రాష్ బిహారీ బోసుకు ఇబ్బంది. అంతేగాక ఇండియాలో గాంధి బ్రిటిష్ వ్యతిరేక విధానాలను జపాన్ వాడుకోదలచింది. బోసుకు ప్రాధాన్యతయిస్తే కాంగ్రెసు కిను కువహించవచ్చు.

ఏప్రిల్ 17న బోసును పంపించడానికి లాంచనంగా అనుమతించినా, ఆగష్టు

ఎరకూ జపాన్ అధికార పూర్వకంగా ఒప్పుకోలేదు. బోసును విమానంలో రోడ్స్ నుండి రంగూన్ వరకు ఎక్కడా ఆగకుండా పంపిస్తామని ఇటలీ ఆహ్వానించింది. జపాన్‌వారు బోసును సచ్‌మెరీన్ ఒకటి సిద్ధంగా వున్న దానిని సైనిక కార్యకలాపాలకు వాడాలని జపాన్ చెప్పింది. ఆఫ్రికాచుట్టి తీసుకెళ్ళాలంటె, అంత సుదీర్ఘ ప్రయాణానికి సబ్‌మెరీన్‌లో చాలా సరంజామా సన్నద్ధం చేయాలి. ఇదంతా తేలికగా అయ్యేదికాదు.

రాష్ బిహారీ బోసు బదులు పరోక్షంగానైనా సరే సుభాష్ చంద్రబోసు భారత జాతీయోద్యమ సంస్థకు అధ్యక్షుడుగా చేయాలని దీవనాద్‌దాసు థాయ్‌లాండ్ పక్షాన వాదించాడు. మరోప్రక్క జర్మనీ క్రమేణా ఇండియాపట్ల అనాసక్తతతో వుండడం వలన, త్వరగా వెళ్ళిపోవాలని బోసు తహతహలాడాడు. ఆగస్టు మొదటి వారంలో ఇటలీ విమానంలో చిక్కులున్న సరే వెళ్ళిపోతానని రిబన్‌ట్రూప్‌ను బోసు కోరాడు. కాని సాధ్యంకాలేదు. ఈలోగా **భారత్** లో ''క్విట్ ఇండియా'' నినాదం వచ్చి బోసు ఆశించినంత పనీ జరిగింది. దేశం యావత్తూ, ఉవ్వెత్తుగా తిరగబడింది. కాని బోసు మాత్రం జర్మనీలో నిస్సహాయుడుగా వున్నాడు.

1942 సెప్టెంబరులో బోసు, ఎమిలీ షెంకిల్ దంపతులకు కుమార్తె పుట్టింది. బెర్లిన్‌లోని ఇండియా కేంద్రాన్ని ఎ.సి.ఎన్. నంబియార్‌కు బోసు అప్పగించేశాడు. అప్పటికి ఆ కేంద్రంలో 25 మంది భారతీయులకి, 10 మంది జర్మన్‌లు పనిచేస్తున్నారు.

అక్టోబరు 14న బోసుకు వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. విదేశమంత్రి రిబన్ ట్రూప్ వచ్చాడు. దేశంలో హిందూ ముస్లిం సమస్య తాత్కాలికమనీ, అది బ్రిటిష్‌వారి సృష్టి అని యువతరానికి మత సామ్రాజ్యవాదం **పట్టదనీ** బోసు ఆ సమావేశంలో చెప్పాడు. స్వతంత్ర భారత దేశంలో పోలీసులకు జర్మనీవారు ''గెస్టాపో'' వలె శిక్షణ యివ్వాలని బోసు కోరగా ఆ విషయం పరిశీలిస్తామని విదేశాంగమంత్రి చెప్పాడు.

1942 అక్టోబరు 15న బోసు రోమ్‌కు వెళ్ళవలసి వున్నది. కాని జపాన్ పక్షం నుండి స్పష్టమైన అనుమతిరాక వాయిదా పడింది. ఇటలీలో రహస్యాలు దాగినందుకు కూడా వాయిదా వేయాల్సివచ్చింది. నవంబరులో బోసు రోం వెళ్ళడానికి ఏర్పాట్లు జరిగాయి. మరోసారి ప్రయాణం వాయిదా అన్నారు. చికాకుపడిన బోసు రిబన్‌ట్రూప్‌కు వ్రాస్తూ తన అవసరం ఆసియాలో ఎంతైనా వున్నదన్నాడు. మరోరెండు మాసాలపాటు బోసు ప్రయాణం చేయడానికి వీల్లేక రేడియో ప్రసంగాలు చేశాడు. గాంధిని కాంగ్రెసుపార్టీని తమకు అనుకూలం చేసుకోజాలమని జపాన్ నిర్ధారణకు వచ్చిన తరువాత బోసు రావడానికి అనుమతించారు.

బోసును గురించి గాంధి వ్రాస్తూ, జపాన్‌వారు ఇండియాకువస్తే మన విమోచనకు గాక, అధికారం పంచుకోడానికి వస్తాడని, కనక సుభాష్ చంద్రబోసు విధానాన్ని తాను అంగీకరించనని అన్నారు. అతడి దేశభక్తి చిత్తశుద్ధి అభినందించదగినవే అయినా, మార్గం తప్పాడని, ఆయన పంథాలో ఇండియాకు విమోచన రాదని అన్నాడు.

కాబూలులో తన ప్రతినిధిగా బోసు ఏర్పాటుచేసిన **రహమత్ ఖాన్** తీరా రష్యా రహస్య ఏజంటని తేలింది. ఇండియాలో బోసు రహస్య స్థావరాలు, సంస్థలనేవి అభూతకల్పనలనీ, కావాలని బోసును

మోసగించారనీ, తప్పుడు నివేదికలిచ్చారని అతడు చెప్పాడు. బోసును ''నమ్మకద్రోహి'' అని ఆరోపించాడు.

ఈలోగా బోసు చావో-బ్రతుకో తేల్చుకోవాలంటూ ఉద్రిక్తపూరిత ఉపన్యాసాలు ప్రసారం చేశాడు. ఆయన సూచన మేరకు మరికొన్ని ప్రసార కేంద్రాలను జర్మనీ నెలకొల్పింది. ఆజాద్ హింద్ సంఘాలు యూరపు అంతటా నెలకొల్పాలన్నాడు.

1943 జనవరిలో ఎట్టకేలకు జపాన్-జర్మనీ మధ్య ఒప్పందం వలన బోసు ఒకే భారతీయ అనుచరుడు ఆబిద్‌హసన్‌తో పాటు కీవ్ హార్బరుకు చేరాడు. ఫిబ్రవరి 8 జర్మనీ సబ్‌మెరిన్ యు-180 ఎక్కాడు రిబన్‌ట్రూప్ వీడ్కోలు తంతి పంపాడు. జపాన్ వారు మడగాస్కర్‌కు తమ సబ్‌మెరిన్‌ను పంపిస్తామన్నారు. ఏప్రిల్ 28న జర్మనీ సబ్‌మెరిన్ నుంచి బోసును జపాన్ సబ్‌మెరిన్‌కు మార్చారు. అక్కడి నుండి బోసు మే 6కు సబంగ్ చేరారు.

బోసు సబ్‌మెరిన్ ప్రయాణవార్త పెద్ద వదంతిగా వ్యాపించింది. దీనిపై అనేక కథలు అల్లారు. ఇండియాలో ఇదొక వింతగా చాలాకాలం చెప్పుకున్నారు. భారత ప్రభుత్వం మాత్రం ఆనాడు (1943) బోసు ప్రయాణాన్ని నమ్మలేదు.

1943 మే 16న బోసు టోక్యో విమానంలో వెళ్ళారు. ప్రముఖ రాజకీయ, సైనికాధిపతుల్ని కలిశారు. రాష్ బిహారి బోసు తక్షణమే బోసుకు ఉద్యమ నాయకత్వం అప్పగించారు. జపాన్ ప్రధాని టోజో జూన్ 10న, 14న బోసును కలిశారు. బోసుతో సమావేశం టోజోకు బాగా నచ్చింది. ఇండియాకు అన్నివిధాలా తోడ్పడి బ్రిటిష్ వారిని పారద్రోలడానికి కృషి చేస్తామని జపాన్ పార్లమెంట్ డయట్‌లో టోజో రెండు రోజుల అనంతరం ప్రకటించారు.

టోకియో రేడియో ద్వారా ప్రతిరోజు ప్రసారం చేయడానికి బోసుకు అనుమతిచ్చారు. సహాయ నిరాకరణోద్యమం సాయుధ పోరాటంగా ఇండియాలో మారాలని, భారతీయులు అగ్నికణాలతో పునీతయైతేగాని స్వాతంత్ర్యానికి అర్హులుకారని బోసు అన్నారు.

1943 జులై 4న సింగపూర్‌లో ఇండియా ఇండిపెండెంట్ లీగ్ అధ్యక్ష పదవిని బోసు అంగీకరించాడు. ఆగష్టు 26న పునర్వ్యవస్థీకరించిన ఆజాద్ హింద్ ఫౌజు నాయకత్వాన్ని స్వీకరించాడు. 1943 అక్టోబరు 21న స్వతంత్ర భారత తాత్కాలిక ప్రభుత్వాన్ని బోసు ప్రకటించాడు.

జర్మనీలో నిరాశానిస్పృహలుచెంది, అవమానాలకు గురై, జాప్యానికి విసుక్కొన్న బోసు అక్కడ సైన్యాన్ని సమకూర్చడంలోనూ నచ్చజెప్పడంలోనూ విఫలుడయ్యాడు.

ఇందుకు భిన్నంగా జపాన్‌లో మలయాలో బోసుకు ఆదరణ, నాయకత్వం, సైన్యాధిపత్యం లభించింది. అయితే జపాన్ బోసుకు ఏమేరకు ఆయన కోర్కెలు తీర్చిందో చూడకముందు రహమత్‌ఖాన్ మోసాలు, ఆజాద్‌హింద్‌ఫౌజు పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకోవడం అవసరం.

యూరప్‌లో భారత యుద్ధ ఖైదీలు ఒక క్రమపద్ధతిలో తయారుకాలేదు. ఇందుకు భిన్నంగా ఆగ్నేయాసియాలో పరిస్థితి అజాద్‌హింద్‌ఫౌజుకు అనుకూలంగా ఉన్నది.

అయితే చాలామంది భ్రమలో ఉన్నట్లు అజాద్‌హింద్‌ఫౌజును సుభాష్ చంద్ర బోసు స్థాపించలేదు. ఆయన జర్మనీలో ఉండగానే అజాద్ హింద్‌ఫౌజు ఆసి

యాలో స్థాపితమైంది. అక్కడ 25 లక్షల కుపైగా భారతీయులు నివసిస్తుండేవారు. జపాన్ బందీలుగా 55వేల మంది భారతీయ సైనికులున్నారు. బ్రిటీష్‌వారు వోడిపోవడం, ఇండియాకు దగ్గరగా మలయా, బర్మా ఉండటం కూడా కలసివచ్చింది. 1942 వేసవి వరకూ భారత సైనికులను గూఢచారి పనులుకు, ప్రచారానికి మాత్రమే జపాన్ ప్రయోగించింది. క్విట్ ఇండియా ఉద్యమంతో అజాద్‌హింద్‌ఫౌజు స్థాపనకు ప్రోత్సాహం లభించింది. రామస్వరూప్ ముఠాను. అమర్‌సింగ్ ముఠాను సంఘటిత పరచి, కెప్టెన్ మన్ మోహన్‌సింగ్ ఆధ్వర్యాన ఫౌజు ఏర్పరచడానికి జపాన్ సిద్ధపడింది.

పెనాంగ్‌లో స్వరాజు సంస్థపేరిట 1942 ఆగస్టు 1 నుండి శిక్షణ ప్రారంభించారు. జపాన్‌వారు శిక్షణపొందిన భారతీయులను తమ స్వార్థానికి వినియోగించేవారు. ఉస్మాన్‌ఖాన్ కల్నల్ జలానీ **ముఠాలను** కూడా గూఢచారి శిక్షణకు ప్రయోగించారు. కెప్టెన్ దురాని ఆధిపత్యానగల ముఠాను వారంతా ముస్లింలు గావడంతో ఇండియా ఉత్తర సరిహద్దులలో వినియోగించుకున్నారు. రంగూన్‌లో కూడా గూఢచారి శిక్షణ కేంద్రాలు పెట్టారు. తొలుత ఇంఫాల్‌కు పోయి ఆక్రమించుకోవాలన్న జపాన్ పథకాన్ని వాయిదా వేశారు.

1942 ఆగష్టులో 40 వేల మంది భారత ఖైదీలు ఆజాద్‌హింద్‌ఫౌజులో చేరడానికి సంసిద్ధత వ్యక్తపరచారు. ఇందులో సైనికాధికారుల బెదరింపులు వలన, చిత్ర హింసల వలన చేరారు. సెప్టెంబర్ నాటికి పదహారువేల మూడువందల మందితో ప్రథమ అజాద్‌హింద్ ఫౌజు ఏర్పడింది. మోహన్‌సింగ్ మాజీ సైనికాధికారి ఆయన విజ్ఞప్తికి చాలా మంది ఉద్విగ్నుల య్యారు. జాతీయవాదం, బ్రిటిష్‌వారి వోటమి. తాను నాయకత్వం వహించడం ఫౌజు ఏర్పడడానికి తోడ్పడినట్లు మోహన్‌సింగ్ చెప్పారు.

అజాద్‌సింగ్ ఫౌజులో మోహన్‌సింగ్ నాయకత్వాన చేరతామని సైనికులు ప్రతినబూనారు. జపాన్‌వారు ఇండియా విమోచనకు తోడ్పడతారని సైనికులకు మోహన్‌సింగ్ హామీ ఇస్తూ, ఇండియా ఆక్రమణకు వారెన్నడూ అంగీకరించబోరని జపాన్‌ను హెచ్చరించాడు. మోహన్‌సింగ్ ఆకర్షణీయ వ్యక్తిత్వం వలన అజాద్‌హింద్ ఫౌజు సఫలమైంది.

జపాన్‌వారు నెమ్మదిగా మాత్రమే అజాద్ హింద్‌ఫౌజు పెంపొందించాలనుకున్నారు. మొదటి దళం ఏర్పరచిన తరువాత 24 వేల మంది మిగిలి ఉన్నారు. రెండున్నర లక్షలనుండి 5 లక్షలవరకూ చేర్చి త్వరితగతిన ఫౌజును పెంచాలని మోహన్‌సింగ్ జపాన్ వారిని ఒత్తిడిచేశాడు. మలయాలో జపాన్ దళాలు తరిగిపోతుంటే, భారతదళాలు పెరిగిపోవడం జపాన్‌కు ఇష్టంలేదు. మొదటి దళం రంగంలోకి పోతే, ఇక అజాద్ హింద్‌ఫౌజు అంటూ సింగపూర్‌లో ఏమీ ఉండదు. ఈ ఫౌజుతో ఒడంబడికకు రాలేకపోయినందున ఇండియాపై దాడికి సిద్ధం కాలేదని జపాన్ నాడు జర్మనీ తెలియపరిచింది.

జపాన్ ఆక్రమిత ప్రాంతాలలో హింద్ ఫౌజుకు పెత్తనం లేదన్నారు. జపాన్ గనుక ఇండియాపై దాడిచేస్తే బ్రిటీష్ వ్యతిరేకభావన దెబ్బతిన వచ్చుననుకున్నారు. భారత లీగ్ సింగపూర్ నుండి చేసే ప్రసారాలపై జపాన్ ఆంక్షలు నానాటికి పెరిగిపోయేసరికి ప్రచారాన్ని చూస్తున్న కె.పి.కె. మీనన్‌కు దుర్భరమై పోయింది. బర్మాలో భారతీయులు పారి

పోగా ఆ ఆస్తి భారతలీగ్‌కు దక్కాలంటే జపాన్‌వారు తమకు రావాలన్నారు. బ్యాంకాక్‌లో లీగ్ తీర్మానాలను జపాన్ ప్రభుత్వం గుర్తించలేదు. ఇండియాను స్వతంత్ర దేశంగా గుర్తించి, ప్రకటించడానికి అజాద్ హింద్‌ఫౌజుకు అధికార గుర్తింపు యివ్వడానికి జపాన్ ఒప్పుకోలేదు. జపాన్ బందీలందరూ యుద్ధ ఖైదీలుగానే పరిగణిస్తారు. అజాద్ హింద్ ఫౌజును జపాన్ కావాలనుకున్నప్పుడే విస్తరిస్తారు.

జపాన్ ధోరణి వలన భారత సైనికులలో మార్పు రావడం జపాన్ అధికారులు గమనించి ఎత్తుగడలు మార్చారు. భారత యుద్ధఖైదీలను జపాన్ కీలుబొమ్మలుగా చేస్తే, జపాన్‌ను దురాక్రమణదారుగా భావిస్తారని మోహన్‌సింగ్ హెచ్చరించాడు.

జపాన్‌కు భారతలీగ్‌కు తెగిందాకా వచ్చింది. టోకియో అంగీకరించనంత వరకు బర్మాకు అజాద్ దళాలు పంపరాదని కార్యచరణ సమితి రాష్‌బిహారిబోసు ఆధ్వర్యాన తీర్మానించింది. అంతటితో మోహన్‌సింగ్, జిలాని, మీనన్, రాఘవన్‌లు కౌన్సిల్‌కు రాజీనామా యిచ్చారు. 1942 డిసెంబరు 8న జిల్‌ను అరెస్టుచేశారు. రాఘవన్‌ను వత్తిడిచేసి రాజీనామా ఉపసంహరింపజేశారు.

అజాద్ హింద్‌ఫౌజును రద్దుచేయాలని మోహన్‌సింగ్ నిర్ణయించాడు. రాష్‌బిహారిబోసు అడ్డుపడ్డాడు. 1942 డిసెంబరు 21న ఫౌజును రద్దుచేస్తూ మోహన్‌సింగ్ ఉత్తరువు జారీ చేశాడు. డిసెంబరు 29న అతడిని ప్రత్యామ్నాయాలు అడిగారు. సుభాష్ చంద్రబోసును పిలిపిస్తే మోహన్‌సింగ్ జపాన్‌వారికి సలహా యిచ్చాడు.

బోసు వచ్చేనాటికి భారతలీగ్ సభ్యులంతా మూకుమ్మడి రాజీనామాలు చేశారు. రాష్ బిహారిబోసును వ్యతిరేకించిన 4 వేల మంది సైన్యాధికారులను న్యూగినియా, దక్షిణ ఫసిఫిక్ దీవులకు తీసుకెళ్ళి నిర్బంధించారు. ఫౌజు సంఖ్య 8 వేలకు తగ్గిపోయింది. వీరిని అజాద్ హింద్‌ఫౌజుగానే జపాన్‌వారు అట్టిపెట్టారు. మోహన్‌సింగ్ నిర్ణయాన్ని వారు గుర్తించలేదు. జపాన్‌వారు చెప్పినట్లు రాష్ బిహారిబోసు దళానికి ప్రచారంచేసి, ఒప్పించడానికి వీరికిచ్చిన సౌకర్యాలే ఆకర్షణ అయ్యాయి. సింగపూర్‌లో రాష్ బిహారి ఒక సమావేశంపెట్టి జపాన్‌వారి ఆధ్వర్యాన నియంతృత్వ పద్ధతులలో ఉద్యమాన్ని నాయకుఁ అట్టిపెట్టాడు.

కల్నల్ జిల్‌ను, కె.పి.కె. మీనన్‌ను ఏకాకిగా జపాన్‌వారు నిర్బంధంలో పెట్టారు. యుద్ధ ఖైదీలుగా మళ్ళీ ఫౌజు వారిని బర్మా-థాయ్‌లాండ్ రైలు మార్గంలో చంపేశారు. న్యూగినియాలోను అలాగే చనిపోయారు. అక్కడికి వెళ్ళిన అజాద్‌హింద్‌ఫౌజు దళంలో బ్రతికిబయటపడ్డవారు లేరంటే జపాన్ క్రూరత్వం ఊహించవచ్చు.

అలాంటి సమయంలో సుభాష్ చంద్రబోసు జపాన్ వచ్చాడు.

రహమత్‌ఖాన్ అసలుపేరు భగత్‌రాం తల్వార్ సుభాష్‌చంద్రబోస్ కలకత్తానుండి తప్పించుకొని పెషావర్ చేరినప్పుడు ఇతడు బోసును కాబూలు వరకు అనుసరించాడు. ఇతడు పఠాన్ యువకుడు. కిసాన్ పార్టీ సభ్యుడు. సరిహద్దు రాష్ట్రాలలో కమ్యూనిస్టుపార్టీతో సంబంధాలు గలవాడు. కొండప్రాంతాలు, వారి భాషలు ఇతడికి కొట్టినపిండి. బెంగాల్ ఫార్వర్డ్ బ్లాక్ దృష్టిలోనూ, పంజాబ్ కిసాన్ పార్టీ మనస్సులలోనూ ఇతడు నమ్మకస్థుడు. జర్మనీవారు ఆర్.కె. అనే పొడి అక్షరాలతో రహమత్‌ను, ప్రస్తావించే

వారు. బోసు కార్యదర్శిగాను, మజోటా వ్యవస్థ కార్యదర్శిగానూ చలామణి అయ్యాడు. బోసు మద్దతుదారులతో ఇండియాలో ఒక కేంద్ర సంఘాన్ని స్థాపించినట్లు ఇతడు జర్మనీవారికి, బోసుకు భ్రమలు కల్పించాడు. భారత రాజకీయ శరణార్థిగా ఉత్తమచంద్ కాబూలులో ఉండేవాడు. 1942లో ఇతడిని అఫ్ఘనిస్తాన్ బహిష్కరించింది.

ఉత్తమచంద్‌కు ఒక షాపు ఉండేది. అందులో ఫాసిస్టు రాజ్య రాయబారులు, సోవియట్ ఏజంట్లు రహస్య సమావేశాలు జరిపేవారు. కొండ ప్రాంతాలలో వైర్‌లెస్ స్టేషన్ స్థాపించి విద్రోహచర్యలకు శిక్షణ ఇవ్వాలనే బోసు కోర్కెను తీరుస్తున్నట్లు రహమత్‌ఖాన్ నటించాడు. వాస్తవానికి అతడెన్నడూ వజీర్‌స్తాన్ కొండప్రాంతం వెళ్ళలేదు. అక్కడ తిరుగుబాటుదారు ఫకీర్ ఆప్‌కు కనిపించ లేదు.

రహమత్‌ఖాన్ రెండో పర్యాయం కాబూల్ వస్తూ తనవెంట హర్‌మందిర్ సింగ్ సేథి, శాంతిమొయ్ గంగూలిని వెంటబెట్టుకొచ్చాడు. మొదటి వ్యక్తి మాస్కోలో శిక్షణపొందిన పంజాబ్ కమ్యూనిస్టు, రెండవ వ్యక్తి బెంగాలీ ఉగ్రవాది. సేథి ద్వారా సోవియట్ రాయబార కార్యాలయంలో ప్రవేశించాలని రహమత్ ఖాన్ విఫలప్రయత్నం చేశాడు. ఉత్తరోత్తర ఇతడు ముందుగా సోవియట్ రాయబార కార్యాలయం సందర్శించి తరువాత ఫాసిస్టు రాయబారులను కలుస్తుండేవాడు. ఫాసిస్టు దేశాలు రహమత్‌కు పుష్కలంగా ధనం ఇచ్చేవి. సోవియట్ యూనియన్‌కు ఇతడు బాగా తోడ్పడ్డాడు.

జర్మనీ ఇచ్చిన వైర్‌లెస్ సెట్‌ను రహమత్ కొండ ప్రాంతాలలోగాక సోవియట్ రాయబార కార్యాలయంలో స్థాపించి, అక్కడి నుండి సందేశాలు పంపేవాడు. ఇండియాలో బోసు అనుచరులు అవన్నీ బోసు చెప్పగా వస్తున్నవని భ్రమిస్తారు. ఈ విధమైన పద్ధతితో రహమత్‌ఖాన్‌ను సోవియట్స్ బాగా ప్రోత్సహించారు. జర్మనీ సైనిక పథకాలేమిటో ఎప్పటికప్పుడు రహమత్ ద్వారా సోవియట్ రష్యాకు తెలుస్తుండేవి.

తాను జర్మన్లకు బోసుకు పంపించే తప్పుడు గూఢచారి నివేదికల్ని రహమత్ ఖాన్ ముందుగా సోవియట్ గూఢచారులకు కాబూలులో చూపెట్టి చిత్రికబట్టి తరువాత పంపేవాడు. సోవియట్లు చాలా మార్పులు చేస్తుండేవారు.

బ్రిటీష్ వ్యతిరేకత భారతదేశంలో బ్రహ్మాండంగా పెరిగిపోతున్నట్లు, ఇండియాలో బోసుపార్టీ ఫార్వర్డ్‌బ్లాక్ రహస్య విద్రోహ చర్యల శిక్షణాకేంద్రం స్థాపించి, రైల్వేవిధానాన్ని కూలద్రోయనున్నట్లు రహమత్‌ఖాన్ బెర్లిన్‌కు నివేదికలు పంపాడు. సైన్యం వదిలివచ్చిన 5,500 మందిలో 2 వేల మంది సాయుధులున్నారని వారిని చిన్న గెరిల్లా దళాలుగా చేసి పంపారని రహమత్ వ్రాశాడు. 3 వేల గాలన్ల పెట్రోలు సిద్ధపరచారని, జర్మనీ విమానాలు దిగడానికి విమానాశ్రయాలు నిర్మించారని అన్నాడు. అయితే ఈ వ్యవస్థలో పేల్చే నిపుణులు, రేడియో ఆపరేటర్లు కొరవడ్డారన్నాడు.

కాబూల్‌లో రహమత్‌ఖాన్‌కు విద్రోహచర్యల శిక్షణను జర్మన్‌లు ఇచ్చారు. ఇవన్నీ ఎప్పటికప్పుడు రష్యాకు చేరాయి. ఇందుకు సంబంధించిన కరపత్రాలు 1942 నవంబరులో రహమత్‌ను అరెస్టు చేసినప్పుడు లభించాయి.

ఇటలీకి కూడా ఇలాంటి తప్పుడు నివేదికల్ని రహమత్ అందజేసి వారి అభిమాన పాత్రుడయ్యాడు.

తన కాబూలు ఏజెంటు రహమత్ ఖాన్ గురించి బెర్లిన్‌లోఉన్న బోసుకు వాస్తవాలు తెలుసుకునే అవకాశంలేదు. అతడు చెప్పేవన్నీ నిజమేనని బోసు నమ్మాడు. తరచు ఇండియాలో తన పార్టీ వారేంచేయాల్సిందీ ఇతడి ద్వారా సందేశాలు పంపేవాడు.

1941 మార్చి 11న జర్మన్ అధికారి ఎట్టెల్ తాను సరిహద్దు ప్రాంతాలకు రహమత్‌తో కలిసి వెడతానని బెర్లిన్ అనుమతి అడిగాడు. అప్పటివరకూ జర్మన్లకు రహమత్‌పై అనుమానం లేదు.

1941 మే 25న ఉత్తర చంద్‌ను కాబూలులో అరెస్టు చేశారు. అయినా అతడిచ్చిన సాక్ష్యంలో రహమత్‌ఖాన్ పేరులేదు. భారత గూఢచారి నివేదికలలో రహమత్ ప్రాధాన్యతను చాలా ఆలస్యంగా కనుగొన్న బ్రిటిష్‌వారు అతడిని అరెస్టు చేసినా హింసించలేదు.

రహమత్‌ఖాన్ 1942 ఏప్రిల్ నుండి తరచు కాబూలు, ఇండియాల మధ్య కొండప్రాంతాల ద్వారా తిరుగుతున్నట్లు బ్రిటిష్‌వారు పసిగట్టినా, సోవియట్‌తో ఒకవైపునా, జర్మనీ-ఇటలీలతో మరోప్రక్కా సంబంధాలున్నాయని తెలుసుకోలేదు.

1942 ఏప్రిల్‌లో జర్మనీ సూచన మేరకు ఇండియా వెళ్ళనున్న రహమత్‌ను ఆప, సోవియట్‌వారు ఒక గూఢచారి అధికారికి అప్పగించారు. ఇండియాలో జర్మన్‌లు చేయదలచిన విద్రోహ చర్యలతోబాటు రహమత్‌ఖాన్ జీవితాన్ని ఆ రష్యా గూఢచారి తెలుసుకొని చాలా ఉపయోగకరంగా భావించాడు. అతడిని ఆ కార్యకలాపాలు కొనసాగించమన్నారు. జర్మన్‌లు ఇచ్చిన విపరీత ధనంతో రహమత్ ఇండియా వెళ్ళాడు.

రహమత్‌ఖాన్ నివేదికలన్నీ ఇండియాలో రాజకీయ గూఢచారులు తయారు చేశారు. రహమత్‌ఖాన్ ఒకేసారి జర్మనీ, జపాన్, ఇటలీలకు రహస్య నివేదికలివ్వడం అతడికి వచ్చే సమాచారం వలన సోవియట్లకు ఫాసిస్టు రాజ్యాల పథకాలు తెలియడం, ఇదంతా బ్రిటిష్‌వారికి అయోమయంగా ఉండేది.

ఇండియాలో బోసు ఆధ్వర్యాన ఒక కేంద్ర విప్లవ సంఘం నడుస్తున్నదనే భ్రమకూడా రహమత్‌ఖాన్ నివేదికలు కల్పించినవే.

సింధు రాష్ట్రంలో హర్స్ జాతులు రైలు పడగొట్టిన సంఘటన రహమత్ ఖాన్ ద్వారా మజోటా వ్యవస్థ ద్వారా రెచ్చగొట్టినట్లు జర్మన్లు తలపోశారు.

1942 నవంబర్ 29న బ్రిటిష్‌వారు అరెస్టుచేయగా, అప్పటినుండి వారికి కూడా సమాచారం అందించడానికి రహమత్‌ఖాన్ అంగీకరించి, ''బహుళార్ధి'' గూఢచారి అయ్యాడు.

కొండప్రాంతాలకు వెళ్ళి జర్మన్ పారాచూటర్లకు స్వాగతం పలకమని రహమత్‌కు బెర్లిన్ సందేశం ఇచ్చింది.

జర్మన్ అధికార్లను వెంటరావద్దనీ, కొండప్రాంతీయులు చంపేస్తారని చెప్పివారిని రానివ్వకుండా ఆపాడు. ఇండియాలో విప్లవాగ్నులు చల్లారనివ్వొద్దని బోసు రహమత్‌ద్వారా ఫార్వర్డ్‌బ్లాక్‌కు సందేశం పంపాడు. కొండజాతుల తిరుగుబాటు తక్షణమే జరపాలన్నాడు.

రహమత్‌ఖాన్ అరెస్టు అయినప్పుడు అధికారులు ప్రశ్నిస్తుండగా బోసుద్రోహినీ, అతడికి తోడ్పడినవారికి కావాలని నమ్మకద్రోహం చేశాననీ అతడు చెప్పాడు. బోసు మాటలన్నీ అతడికే అప్పగించానన్నాడు. బోసు రాకవలననే తనకు ఆప్తుని

స్తాన్‌లో జర్మన్లతో సంబంధం ఏర్పడిందని రహమత్ వాజ్మాలం ఇచ్చాడు. ఇండయాలో బోసుపార్టీతో తనకు ఎలాంటి సంబంధంలేదన్న విషయం తెలుసుకునే అవకాశం జర్మన్లకులేదని ఘంటాపథంగా చెప్పాడు. జపాన్ గూఢచారులు ఇండియాకువచ్చి కూడా, ఉనికిలోలేని బోసు విప్లవ కేంద్ర సంఘాన్ని కలిసే అవకాశం లేదన్నాడు. తన నివేదికలన్నీ రష్యావారు చిత్రికబట్టినట్లు ఒప్పుకున్నాడు.

ఇండియాలో కీర్తిపార్టీకి, కమ్యూనిస్టులకు తన విషయం, కార్యకలాపాలు తెలుసునని రహమత్ చెప్పాడు.

మోసపోయిన సుభాష్

లాహోర్‌లో రహమత్ ఇచ్చిన సమాచారం బ్రిటీష్ వారికి ఎంతో ఉపయోగపడింది. సోవియట్ రష్యా రికార్డులలో ఇతడిని గురించి ఏమున్నదో బయటబడితేగాని మరికొన్ని సత్యాలు తెలియవు. ఏమైన రహమత్ మొదటి నుండి సోవియట్ రష్యాకు విధేయుడుగాఉంటూ, బోసుకు నమ్మకద్రోహం చేశాడు.

1943లో రష్యావారు కాబూలులోని జర్మన్ వాణిజ్యాధికారి రాస్మన్‌ను, ఇతరులను ఇరకాటానబెట్టి వారి రహస్య చర్యలను బట్టబయలుచేస్తామనే సరికి, వారంతా తెల్లబోయి రహమత్‌ఖాన్‌పేరు చెప్పారు. అయినా ఈవిషయంబైటకు పొక్కితే జర్మనీలో తమ బాధలను గుర్తు తెచ్చుకొని కాబూలులో జర్మనీలు రహమత్ జోలికిపోలేదు!

ఇలాంటి వ్యక్తిని నమ్మి సుభాష్ ఎలా మోసపోయాడో చెప్పనక్కరలేదు.

అజాద్ హింద్ ఫౌజ్

రద్దయిన అజాద్ హింద్‌ఫౌజుకు బోసు మళ్ళీ జీవంపోసి 20 వేలకు పెంచాడు. జాన్సీరాణి పేరిట స్త్రీల దళాన్ని ఒకటి ఏర్పరచాడు. 10 వేల మందితోకూడి మరోమూడు దళాల్ని ఏర్పరచాలనే కోర్కె కాగితంపై నిలిచిపోయింది.

1943 అక్టోబర్‌లో తాత్కాలిక స్వేచ్ఛాభారత ప్రభుత్వాన్ని సుభాష్ ప్రకటించాడు. రాష్ట్రపతి, ప్రధాని, యుద్ధ మంత్రి, విదేశాంగమంత్రిగా తన పేరును బోసు ప్రకటించుకున్నాడు. ఉద్యమనేతగా తనను ఇకముందు నేతాజీ అని పిలవాలన్నాడు. సైనిక యూనిఫారం వేసుకున్నాడు.

1943 నవంబరులో అండమాన్, నికోబారు దీవులకుబోసు తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించి పెత్తనమంతా తమ సైన్యాధిపత్యం క్రింద జపాన్ అట్టిపెట్టింది. అజాద్ హింద్ ఫౌజులో నిర్బంధించిన 4 వేల మందిని, వారి నాయకులను, ముఖ్యంగా బోసు నాయకత్వాన్ని తొలుతనుండీ కోరిన మోహన్‌సింగ్‌ను విడిపించడానికి సుభాష్ కించిత్తు ప్రయత్నం చేయలేదు. జర్మనీలో ప్రతిభారతీయఖైదీని కాపాడడానికి బోసు ప్రయత్నించాడు.

బోసు ఓటమి

1943 డిసెంబరులో బోసు వెళ్ళి మోహన్‌సింగును జైలులో చూచి చర్చలు జరిపారు. బోసు సరైన వ్యక్తి అయినప్పటికి తగిన సమయం, తగిన సాధనలేదన్నాడు. సింగ్ అజాద్ హింద్ ఫౌజుకు తగిన సాధనాసామగ్రి లేదని బోసు అంగీకరిస్తూనే, తన ''చలోఢిల్లీ'' నినాదానికి దేశంలోని సైన్యమంతా బ్రిటిష్‌వారిపై తిరగబడి, తనను అనుసరిస్తారన్నాడు. మోహన్‌సింగ్ సైన్యం నుంచి వచ్చిన వ్యక్తి. బోసు ఆత్మవిశ్వాసంపట్ల అతను దిగ్భ్రమచెంది, పట్టుబడిన సైనికులంద

రినీ బ్రిటిష్ వ్యతిరేకులుగా చేయడంలో విఫలమైన విషయం గుర్తుచేశాడు. జర్మనీలో బోసు వైఫల్యంతో తిరిగి వచ్చిన వాడే. ఇండియాలో జనంగాని సైన్యం యావత్తుగాని బ్రిటిష్‌వారిపై తిరగబడతా ననేది మిథ్య అంటూ, జపాన్‌కు వ్యతిరేకంగా వాతావరణం ప్రబలిందని మోహన్ సింగ్ చెప్పాడు. బ్రిటిష్‌వారిని సరైన సమయంలోకొట్టే అవకాశాన్ని జారవిడచినరీత్యా, బోసు సాహసం కేవలం చలగాటమవుతుందని హెచ్చరించాడు. బోసుకు మోహన్‌సింగ్ వాస్తవిక ధోరణి నచ్చలేదు. 1943 వేసవిలో ఆజాద్ హింద్ ఫౌజు భారత భూభాగంపై అడుగుపెడుతుందని బోసు సైన్యాలతో చెప్పాడు. జపాన్‌వారు కూడా యిదివిని ఆశ్చర్యపోయారు. జపాన్‌దాడిలో 6 వేల మంది అజాద్ హింద్ ఫౌజును జపాన్ అనుమతించింది. అది కూడా యుద్ధరంగంలో కాదు. జపాన్ సైన్యాలకు అండగా సరఫరాలు అందించే ద్వితీయశ్రేణి ఫౌజును అనుమతించారు. ఇంఫాల్‌పై దాడిలో జపాన్ సైన్యాలు చిందిన్ నదిని దాటారు. అజాద్ హింద్‌ఫౌజుకు షానవాజుఖాన్ ఆధ్వర్యం వహించగా, మరికొందరు ఫౌజులో గూఢచారులుగా దేశంలో ప్రచారానికి వినియోగించ బడ్డారు.

పర్వతప్రాంతాలుగా భారీ వర్షాలవలన దార్లన్నీ కొట్టుకుపోగా, జపాన్ సైన్యాలకు ఆహారం, ఆయుధాలు సరఫరాకాలేదు. ఆజాద్ హింద్ ఫౌజువారు స్థానిక గిరిజనులపట్ల క్రూరంగా, అమానుషంగా ప్రవర్తించి వారి ఆగ్రహానికి గురైనారు. ఫౌజులో చాలా మంది లొంగిపోయారు. కొందరు సైన్యం వదలి పారిపోయారు. 2,20,000 జపాన్ సైన్యంలో బ్రతికిబయటపడిన వారు 1,30,000 మాత్రమే. అజాద్ హింద్ ఫౌజులో బ్రతికిన 2,600 మందిలో 2,000 ఆస్పత్రి పాలైనారు. 715 మంది సైన్యం వదలిపోగా 800 మంది లొంగిపోగా, చనిపోయినవారు 400 మంది. పదిహేను వందల మంది రోగాలతో, ఆకలితో అలమటించి చనిపోయారు. అజాద్‌హింద్ ఫౌజు ఎత్తుగడలు ఎదురుదెబ్బతీసే ధోరణి లోపించిందని జపాన్ సైన్యాధిపతి పూజివారీ వ్యాఖ్యానించాడు. ఇదంతా 1944 వర్షా కాలంలో జరిగింది.

బోసు దళాలలో దిగజారుడుతనం ప్రబలింది. ఇంఫాల్‌లో ఏమీ జరగనట్లే బోసు ఇంకా ధైర్యం చెప్పడానికి ప్రయత్నించాడు. బ్రిటిష్ సైన్యాలకంటే అజాద్ హింద్ ఫౌజు గొప్పదని ప్రసంగాలు చేశాడు. ఫౌజును ఇంకా విస్తరించి శిక్షణ ఇవ్వాలని, జపాన్ సైన్యం కాడికింద పారేసినా ఫౌజు పోరాటం సాగించాలని బోసు ఆవేశంతో మాట్లాడేవాడు. బ్రిటీష్ వారిపై పోరాటంలో సోవియట్ సహాయం స్వీకరించాలనే ధోరణి బోసుకు ఆఖరు క్షణాలవరకు అంటే పెట్టుకునే ఉన్నది.

జపాన్‌వారు ఫౌజులోని వారు బోసుకు నచ్చజెప్పి ఆయన్ను మంచూరియా ప్రయాణానికి సన్నద్ధం చేశారు. అక్కడకు సోవియట్లువస్తే వారికి నచ్చజెప్పి, సహాయం స్వీకరించాలని బోసు ఆశ. కాని 1945 ఆగష్టు 18న తైవాన్‌లోని తైహూకూవద్ద విమాన ప్రమాదంలో బోసు దుర్మరణం చెందాడు. ఆకర్షణీయమైన ఉద్రేకపూరితమైన దేశభక్తుడు బోసు అలా అంతమయ్యాడు.

జపాన్‌వారు ఇండియాపట్ల ఏం చేయదలచిందీ బోసుకు ఎన్నడూ చెప్పలేదు. ఆయన్ను వాడుకోవడమనేదే జపాన్ ఎత్తుగడ. ఉద్రేకంలో ఉద్వేగంలో ఉన్న బోసు జపాన్‌వారి ప్రోత్సాహాన్ని అపార్థం చేసుకున్నారు. జర్మనీవలె ఇండియా స్వాతంత్ర్యం కొరకు జపాన్‌తో బోసు పట్టుబట్టలేదు.

ఇదీ చరిత్ర. దీనిని నిష్పాక్షికంగా అవగాహన చేసుకోవడం ముఖ్యం.

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt. Ltd. 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.

FORM IV (See Rule 8)

Statement about ownership and other particulars of MISIMI

1. Place of Publication	:	1-1-60/5, Iftekar Mansion Lane RTC X Roads, Musheerabad Hyderabad-500 020 A.P
2. Periodicity of its Publication	:	Fort Nightly
3. Printer's Name	:	ALAPATI RAVINDRANATH
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin	:	-
Address	:	1-1-60/5, Iftekar Mansion Lane, RTC X Roads, Musheerabad Hyderabad-500 020
4. Publisher's Name	:	ALAPATI RAVINDRANATH
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin		
Address	:	1-1-60/5, Iftekar Mansion Lane, RTC X Roads, Musheerabad Hyderabad-500 020
5. Editor's Name	:	ALAPATI RAVINDRANATH
Whether citizen of India	:	Yes
If foreigner state the country of origin	:	-
Address	:	1-1-60/5, Iftekar Mansion Lane RTC X Roads, Musheerabad Hyderabad-500 020
6. Names and address of individuals who own the news-paper and partners or shareholders holding more than one percent of the total capital.	:	Kala Jyothi Process Pvt. Ltd. 1-1-60/5, RTC X Roads, Musheerabad, Hyderabad-500 020

I, ALAPATI RAVINDRANATH, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

for KALA JYOTHI PROCESS Pvt., Ltd.,
Sd/ ALAPATI RAVINDRANATH
Publisher

Date: March 10, 1990.

Phone: 67148/66909.
Grams: CARDI CAP.
Telex: 0425-2043 NAAP IN

AN ADVANCED

TECHNOLOGY

FOR AN IMPROVED

QUALITY OF LIFE

NATCO

NATCO FINE PHARMACEUTICALS PVT. LTD.
Regd off: 1-10/12, Ashoknagar, Hyderabad-500 020.